క్లుప్తంగా

పాత బస్టాండ్‌లో వాటర్‌ప్లాంట్‌ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం

ఖమ్మంమయూరిసెంటర్‌: నగరంలోని ఆర్టీసీ పాత బస్టాండ్‌లో ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ను రీజినల్‌ మేనేజర్‌ చెరుకుపల్లి వెంకన్న సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రయాణికులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు వాటర్‌ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ ఆపరేషన్‌ పవిత్ర, డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ మెకానికల్‌ భవాని ప్రసాద్‌, డిపో మేనేజర్‌ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కామేపల్లి: పండితాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ నాయకులు మద్దినేని రమేష్‌బాబు కుమారుడు పవన్‌కృష్ణ ఇటీవల మృతి చెందగా సోమవారం పవన్‌కృష్ణ చిత్రపటానికి కాంగ్రెస్‌ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, ధరావత్‌ అనురాధ, దొడ్డ వేణు, అంబడిపూడి అప్పయ్య, చల్ల మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

ఖమ్మంఅర్బన్‌: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధరావత్‌ వికాస్‌కు నగరంలోని బాలపేటకు చెందిన ప్రొఫెసర్‌ భూక్యా కృష్ణ రాథోడ్‌ సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేల నగదు అందజేశారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్‌: ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా బీజేపీ ఎన్నికల ప్రచారం చేస్తుందని, ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని తెలంగాణ పీపుల్స్‌ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ(టీపీజేఏసీ) రాష్ట్ర నాయకులు చిర్రా రవి, జిల్లా కన్వీనర్‌ దేవిరెడ్డి విజయ్‌, కోకన్వీనర్స్‌ తాళ్లూరి వేణు, దుర్సోజు రవేష్‌లు అన్నారు. సోమవారం టీపీజేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌, ప్రభాకర్‌, దశరథ, సుదర్శన్‌, సైదులు, కృష్ణారెడ్డి, కళ్యాణ్‌ చక్రవర్తి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బాక్‌
వినోద	టిల్లు 2
సాయిరాం	ప్రసన్న వదనం
ఆదిత్య	శబరి
శ్రీనివాస	ఆ.. ఒక్కటీ అడక్కు

- ఖమ్మం గాంధీచౌక్‌

ఖమ్మం రైతుబజార్‌, సమీకృత మార్కెట్‌

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	5
వంకాయ	20		20
బెండకాయ	24	పాలకూర	2
పచ్చిమిర్చి	64		10
కాకర	50	చుక్కకూర	2
బీర	56		10
దొండ	34	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	86	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్‌	35		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	44		30
క్యారెట్‌	40	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

అత్యవసరం నామమాత్రమే..!

ప్రాభవం కోల్పోతున్న పెద్దాస్పత్రి ఐసీయూ

- అందుబాటులో ఉండని వైద్యులు
- అనుభవం లేని వారితో సేవలు..
- జీతాలు అందక ఇబ్బంది పడుతున్న సిబ్బంది



పెద్దాస్పత్రిలోని ఐసీయూ విభాగం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలోని ఇంటెన్సివ్‌ కేర్‌ యూనిట్‌ (ఐసీయూ)లో అత్యవసర సేవలకు బ్రేకులు పడుతున్నాయి. కొంతకాలంగా వైద్యసేవలు అందక రోగులు ఇతర ఆస్పత్రులకు తరలిపోతున్నారు. కొందరిని హైదరాబాద్‌, వరంగల్‌ ఆస్పత్రులకు రిఫర్‌చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని దుస్థితి ఏర్పడటంతో ఐసీయూ సేవలపై నీలినీడలు అలముకున్నాయి. పెద్దాస్పత్రిలో ఏదో అత్యవసర సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో ఐసీయూ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాయకల్ప, ఎన్‌క్వాస్‌, లక్ష్య వంటి అవార్డులు సాధించిన ఖమ్మం ప్రభుత్వాస్పత్రి క్రమంగా తన ప్రాభావాన్ని కోల్పోయే పరిస్థితి దాపురించింది. ముఖ్యంగా అత్యవసరమైన ఐసీయూలో నిరంతరం వైద్య సేవలు అందించాల్సి ఉన్నా వైద్యులు లేక ఆ విభాగం వెలవెలబోతోంది. సిబ్బందితో నెట్టుకు వస్తుండటంతో రోగుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు అనుభవం లేని సీనియర్‌ రెసిడెంట్లు, డీఆర్‌పీ వైద్యులతో నిర్వహణ చేస్తుండటంతో సేవలు మరింత దిగజారుస్తున్నారు.

గతమెంతో మిన్న..

పెద్దాస్పత్రిలోని ఐసీయూలో గతంలో మెరుగైన వైద్య సేవలు అందేవి. వేలాది మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల ప్రాణాలు నిలిపింది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవటంతో నామమాత్రంగా సేవలు అందిస్తూ నెట్టుకొస్తున్నారు. ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి చుట్టుపక్కలే కాకుండా సుమారు 100 కిలోమీటర్ల పరిధిలో యాక్సిడెంట్‌ కేసులు వస్తుంటాయి. ఆత్మహత్య, ఇతర అనారోగ్య కారణాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఇక్కడ ఉన్న ఐసీయూలోకి తరలిస్తుంటారు. అయితే ఐసీయూలో వైద్యులు మాత్రం అందుబాటులో ఉండట్లేదు. నిత్యం 24 గంటలు షిప్టుల వారీగా ఉండాల్సిన వైద్యులు లేకపోవటంతో నర్సింగ్‌ సిబ్బందితో నెట్టుకువస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా అత్యవసర వైద్యానికి సంబంధిత విభాగ వైద్యుడు ఫోన్‌లోనే సూచనలు ఇస్తుంటే వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ సేవలపై పెదవి విరుస్తున్న బంధువులు కొందరు చేసేది లేక ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. ఐసీయూలో వైద్యులు కేటాయించకపోవటంతో జూనియర్‌ వైద్యులతో సేవలు అందిస్తున్నారు.

మెడికల్‌ కళాశాల వచ్చాక ఖాళీ..

ప్రభుత్వాస్పత్రికి అనుసంధానంగా మెడికల్‌ కళాశాల ఏర్పాటు చేయటంతో గతేడాది సెప్టెంబర్‌ నుండి బోధన ప్రారంభించారు. అయితే పెద్దాస్పత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యవిధాన పరిషత్‌కు చెందిన వైద్యులను వారి ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశారు. దీంతో ఐసీయూలో ఉండే వైద్యులు వెళ్లిపోయారు. దీనికి తోడు కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన పనిచేస్తున్న ఐసీయూ వైద్యుడు శ్రీనివాస్‌కు ఏడాదిగా జీతం చెల్లించలేదు. దీంతో ఆయన తన ఇటీవలే రాజీనామా చేశారు. ఫలితంగా ఐసీయూలో శాశ్వత వైద్యులు లేకుండాపోయారు. ప్రస్తుతం ఐసీయూకు వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండకపోవటంతో అత్యవసర వైద్యసేవలపై తీవ్ర ప్రభావం పడుతోంది. మెడికల్‌ కళాశాల వచ్చాకే ఈ పరిస్థితి వచ్చిందని ఆస్పత్రిలో సిబ్బంది కొందరు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు వేలాది మందికి సేవలు అందించి ప్రాణాలు నిలిపిన ఐసీయూ ప్రస్తుతం ఈ పరిస్థితి వస్తుందని అనుకోలేదని చెబుతున్నారు. దీనికి తోడు కాంట్రాక్ట్‌ పద్ధతిలో పనిచేస్తున్న ఎంఎన్‌ఓలు, ఎఫ్‌ఎన్‌ఓలు, సిస్టర్స్‌, సెక్యూరిటీ సిబ్బందికి తొమ్మిది నెలలుగా జీతాలు అందకున్నా తమ గోడు పట్టించుకునే వారే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలో చేరిన వారికి అండగా..

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పించారు. మండలంలోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మంత్రి కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్‌ దండా పుల్లయ్య, చెరకు అభివృద్ధి మండలి మాజీ డైరెక్టర్‌ వీరెల్లి నాగరాజు, మార్కెట్‌ కమిటి మాజీ డైరెక్టర్‌ దండా నరసింహరావు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ శాఖమూరి రమేష్‌, మైశా శంకర్‌, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని నాచేపల్లి, కట్టుకాసారాం, మంగ్రాజుపల్లి గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు కాంగ్రెస్‌ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ప్రసాద్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

ఓటేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- కాంగ్రెస్‌ అభ్యర్థి రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్‌: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజాస్వామ్యం ప్రమాదపుటంచున పడిందని, కాంగ్రెస్‌కు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్‌ పార్టీ లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని ప్రసాద్‌ హైట్స్‌ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్‌ నాయకులు నూకల నరేష్‌రెడ్డి, ఆశ్రిత, మద్దినేని స్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మానుకొండ రాధాకిషోర్‌, అసోసియేషన్‌ బాధ్యులు కిలారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో ప్రచారం..

ఖమ్మం లీగల్‌: ఖమ్మం కోర్టు ప్రాంగణంలో రామసహాయం రఘురాంరెడ్డి న్యాయవాదులను, న్యాయ శాఖ ఉద్యోగులను కలిసి తనకు ఓటు వేయమని అభ్యర్థించారు. నిరంజన్‌రెడ్డి, శరత్‌కుమార్‌ రెడ్డి, రామకృష్ణ, కాంగ్రెస్‌ లీగల్‌ సెల్‌ న్యాయవాదులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి లింగాల రవికుమార్‌..

ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్‌ అంబేడ్కర్‌ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్‌ ఖమ్మంలోని ఆయన నివాసంలో ఎంపీ అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డి, కాంగ్రెస్‌ నగర అధ్యక్షుడు ఎండీ.జావిద్‌ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మద్దినేని బేబి స్వర్ణకుమారి, న్యాయవాది నిరంజన్‌రెడ్డి, పున్నయ్య, గుంతేటి వీరభద్రం, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, కాసిం, సతీష్‌, కృష్ణమోహన్‌, మజీద్‌, రాములు, గంగాధర్‌, యోనా, రవి, కృష్ణ పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో మోసం..



కూసుమంచి: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు



ఖమ్మంమయూరిసెంటర్‌: ప్రచారం చేస్తున్న నామ తనయులు

కూసుమంచి: అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వ ప్రజలను మోసం చేసిందని, మరోమారు మోసం చేసేందుకు సిద్ధం అయిందని ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి నామ విజయాన్ని కోరుతూ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో వారు మాట్లాడారు. పార్టీ మండలాధ్యక్షుడు వీరయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్‌: నామ నాగేశ్వరరావు గెలిస్తేనే జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్‌ ఖమ్మం పార్లమెంట్‌ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కుమారులు నామ పృథ్వీ తేజ, నామ భవ్య తేజ, నామ సాయిరాం అన్నారు. నామ విజయాన్ని కాంక్షిస్తూ వారు నగరంలోని వీడీవోస్‌ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు తాజుద్దీన్‌, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా నామను న్యాయవాదులు గొల్లపూడి రామారావు, లక్ష్మీనారాయణ సన్మానించారు.

నేలకొండపల్లి: నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ నేలకొండపల్లి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. మండల పరిషత్‌ కో–ఆప్షన్‌ సభ్యులు ఎండీ.వాజీద్‌, నాయకులు తదితరులు ఉన్నారు.

‘బీజేపీని తరిమికొట్టండి’



ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



సీపీఐ ఆధ్వర్యంలో..

ఖమ్మంమయూరిసెంటర్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి బీజేపీని తరిమికొట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్‌ సలాం పిలుపునిచ్చారు. సోమవారం నగరంలో చిరువ్యాపారులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్‌లో కాంగ్రెస్‌ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు సాంబశివరెడ్డి, జ్వాల నరసింహారావు, ఎస్‌కె రెహమాన్‌, శ్రీదేవి, లాలు, సాయి, దుర్గానాథ్‌, రహిమాన్‌ తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డిని గెలిపించండి..

అదేవిధంగా పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్‌ సీపీఎం టూటౌన్‌ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని రమణగుట్ట ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ టూటౌన్‌ కమిటీ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్‌, నర్రా రమేష్‌, ఎస్‌.కుమారి, గుమ్మడి భిక్షం, బీబీ, సత్యం, గుమ్మడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమం

ఖమ్మంలీగల్‌: జిల్లా కోర్టుకు కొత్తగా నియమితులైన న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటుచేసినట్లు బార్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి సీహెచ్‌.వెంకట్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్‌ డిస్ట్రిక్ట్‌ అండ్‌ సెషన్స్‌ జడ్జి, ప్రిన్సిపల్‌ సీనియర్‌ సివిల్‌ జడ్జి, అడిషనల్‌ సీనియర్‌ సివిల్‌జడ్జి పరిచయ కార్యక్రమం ఉంటుందని, అసోసియేషన్‌ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఫాసిస్టు శక్తులను ఓడించండి

ఖమ్మంమయూరిసెంటర్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ ఎన్డీఏ ఫాసిస్టు శక్తులను ఓడించాలని సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్‌ పిలుపునిచ్చారు. ఓటర్‌ చైతన్య కార్యక్రమంలో భాగంగా సోమవారం గట్టయ్యసెంటర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుల అశోక్‌ మాట్లాడుతూ... బీజేపీ ఇచ్చిన వాగ్దానం తుంగలో తొక్కిందని అన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు ఏర్పరిచి దేశాన్ని విభజించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్‌ కార్యదర్శి ఝాన్సీ, శ్రీనివాస్‌, శోభ, రాకేష్‌, సురేష్‌, రవీందర్‌, ప్రణయ్‌, స్టాలిన్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

ఖమ్మంఅర్బన్‌: రోడ్డు ప్రమాదంపై సోమవారం ఖమ్మం అర్బన్‌ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 4న పని కోసం మార్బుల్‌ మేస్త్రీ సోందు మియా బైక్‌పై ఖమ్మం వస్తుండగా వైరారోడ్డులో మైసమ్మగుడి వద్ద బస్సు వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సోందుమియాకు తీవ్రగాయాలవ్వడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి భార్య మస్తాన్‌ బి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శివాలయంలో స్వామి వారి కల్యాణం

ఖమ్మంగాంధీచౌక్‌: మాసశివరాత్రి సందర్భంగా నగరంలోని త్రీటౌన్‌ ట్రంక్‌ రోడ్‌లో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటుమల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చుండూరి రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మలు సాంప్రదాయ పద్ధతిలో శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించింది.



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

‘కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు’



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: కాంగ్రెస్‌ ప్రభుత్వానివి మోసపూరిత వాగ్దానాలే తప్పా ప్రజలబాగు మాత్రం పట్టడం లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ అన్నారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం మండలంలోని రఘునాథపాలెం కేసీఆర్‌ కాలనీ, బూడిదంపాడులో ప్రచారంతోపాటు కేసీఆర్‌ కాలనీ వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడి కారు గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్‌ పార్టీ 420 హామీలు ఇచ్చిందే తప్ప దాన్ని ఆచరణ సాధ్యం చేయట్లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌ బూటకపు వాగ్దాలతో మేలు జరగదని గ్రహించాలని, కాంగ్రెస్‌ ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని అమలుచేయించే బాధ్యత బీఆర్‌ఎస్‌ తీసుకుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి నామ నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మాలోత్‌ వీరునాయక్‌, నాయకులు మద్దినేని వెంకటరమణ, ఎం. వెంకటయ్య, తుమ్మలపల్లి మోహన్‌రావు, వల్లభనేని వెంకటప్పారావు, కుతుంబాక నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీ కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న పొంగులేటి ప్రసాదరెడ్డి

తిరుమలాయపాలెం: కాంగ్రెస్‌ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని హైదర్‌సాయిపేట, జల్లెపల్లి, పిండిప్రోలు, తిరుమలాయపాలెం గ్రామాలలో పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. దేశ చరిత్రలోనే అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలని, కాంగ్రెస్‌ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, పార్టీ మండలాధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్‌, ఎంపీపీ మంగీలాల్‌, బీరోలు సొసైటీ చైర్మన్‌ రామసహాయం నరేష్‌రెడ్డి, నాయకులు చావా శివరామకృష్ణ, అరవిందరెడ్డి, ఉన్నం రాజశేఖర్‌, పోట్ల కిరణ్‌, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఖమ్మంగాంధీచౌక్‌: నగరంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న శ్రీ శాస్తా దేవస్థానంలో 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ తంత్రి టీకే దామోదరన్‌ తంత్రి, ఆలయ పూజారి పాకతిల్లం నారాయణన్‌ నంబూద్రిలు సాంప్రదాయ పద్ధతుల్లో ప్రారంభించారు. ఈ నెల 14 వరకు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక హోమాలను, పూజలను నిర్వహించనున్నారు. ఈ మేరకు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్టు కమిటీ తెలిపింది.

బీజేపీతోనే సామాజిక న్యాయం..



ఖమ్మం మామిళ్లగూడెం: ప్రచారం నిర్వహిస్తున్న వినోద్‌రావు సతీమణి వినీలరావు



తిరుమలాయపాలెం: పిండిప్రోలులో ఎమ్మార్పీఎస్‌ నాయకుల ప్రచారం..

ఖమ్మం మామిళ్లగూడెం: సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు సతీమణి వినీలరావు అన్నారు. సోమవారం వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ బీజేపీ జిల్లా అధికారప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్‌ ఆధ్వర్యంలో నగరంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. సరస్వతి, మురళి, ధర్మేందర్‌, సంతోష్‌, శివరాంభట్ల, రాజేశ్వరరావు, నాగేంద్ర, నరసింహరావు, జాని, తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా బీజేపీ టూటౌన్‌ అధ్యక్షుడు భద్రం, పాశం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నగరంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు డాక్టర్‌ గొంగూర వెంకటేశ్వర్లు, రుద్రప్రదీప్‌, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్‌ అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం బీజేపీకి ఓటు వేయాలి

యువతి ఉపాతఉట కోసం బీజేపీకి ఓటు వేయాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌లాల్‌ కోరారు. ఈ మేరకు ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎంపీగా గెలిచిన నామా నాగేశ్వరరావు యువతకు నామాలు పెట్టడం తప్పా చేసిందేమిలేదన్నారు. నాయకులు ఉపేందర్‌, రాథోడ్‌ , మాధవ్‌, హుస్సేన్‌, రాహుల్‌, మణికంఠం, మమేందర్‌, వినోద్‌ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీకే మాదిగలు మద్దతు తెలపాలని ఎమ్మార్పీఎస్‌ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ చింతిరాల నాగభూషణం పిలుపునిచ్చారు. మండలంలోని పిండిప్రోలులో బీజేపీ ఎంపీ అభ్యర్థి వినోద్‌రావు గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. మండల ఇన్‌చార్జ్‌ పగిడిపల్లి బాబు, మండలాధ్యక్షుడు రాంగోపాల్‌, గొర్రెపాటి దర్గయ్య, వంగూరి వెంకన్న, వశపొంగు మల్లయ్య, కొలిక పొంగు మేఘరాజు, కిన్నెర రమేష్‌, వంగూరి వెంకన్న పాల్గొన్నారు.

అకాలవర్షంతో పంట నష్టం..

ఖమ్మంఅర్బన్‌, రఘునాథపాలెం: అకాల వాన, గాలి బీభత్సంతో వందలాది ఎకరాల్లో పంటనష్టం ఏర్పడింది. మామిడితోటల్లో కాయలన్నీ నేలరాలడంతో పాటు, చెట్ల కొమ్మలన్నీ ఎక్కడిక్కడే విరిగి పడ్డాయి. కాపుదశలో ఉన్న బొప్పాయి తోటలు గాలితో నరికినట్లె ఎక్కడిక్కడే విరిగి పడిపోయాయి. ఈ మేరకు పంట నష్టంపై ఉద్యాన వన అధికారులు సోమవారం పలు గ్రామాల్లో దెబ్బతిన్న పండ్ల తోటలను పరిశీలించి తాత్కలిక నష్టం అంచనాలు వేస్తున్నారు. నగర శివారు గ్రామాలైన బాలపేట, బల్లేపల్లి, అల్లీపురం, కొత్తగూడెంతో పాటు, రఘునాథపాలెం మండలంలోని రఘునాథపాలెం, చింతగుర్తి, వీవీపాలెం గ్రామాల్లో మామిడి, బొప్పాయి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరు గాలం వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికందే దశలో ప్రకృతి విలయ తాండవంతో పెట్టుబడులు కూడా రాకుండా నష్టం పోయామని చెబుతున్నారు. రఘునాథపాలెం, చింతగుర్తి గ్రామాల్లోనే 65 ఎకరాల్లో మామిడి తోటలకు తీవ్ర నష్టం జరిగిందని ఉద్యాన అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇంకా గ్రామాల వారీగా నష్టంపై వివరాలు సేకరిస్తునట్టు తెలిపారు. ఇలాంటి తరుణంలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.



నష్టం అంచనా వేస్తున్న అధికారులు



వీవీపాలెంలో విరిగి పడిన బొప్పాయి తోట